క్లుప్తంగా

రెడ్‌క్రాస్ దినోత్సవం



రక్తదానం చేస్తున్న దాతలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం పలమనేరు రోడ్డులోని రెడ్‌క్రాస్ భవనంలో గురువారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి సభ్యులు నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించి 25 యూనిట్ల రక్తాన్ని దాతల ద్వారా సేకరించారు. పిల్లలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనాథ ఆశ్రమాల్లో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థిని

ఐరాల: విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత సూచించారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, పొడుపు కథలు, ఇంగ్లిష్ జంబ్లింగ్ పదాల ఉచ్ఛరణ, గణితం, జీకే తదితర అంశాల్లోని మెళకువలను వివరించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయని తెలిపారు. సెల్‌ఫోన్ వల్ల కలిగే నష్టాలు, పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కరెంట్ తీగ



తలకు తగిలే ఎత్తులో ఉన్న కరెంటు తీగలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం గువ్వకల్లు గ్రామంలో కరెంట్ తీగలు (11కేవీ) తలకు తగిలేలా ఉన్నాయి. వారం కిందట కురిసిన వర్షానికి కరెంటు తీగలు కింద పడ్డాయి. కరెంటు లేని సమయంలో గ్రామస్తులు ఆ తీగలను కొబ్బరి చెట్టుకు కట్టిపెట్టారు. 11 కేవీ లైన్ కావడంతో ప్రమాదకరంగా ఉండడంతో గ్రామస్తులు భయపడుతున్నారు. ఆ మార్గంలో వెళ్లేందుకు ఉలిక్కి పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తలకు తగిలే కరెంటు తీగలను సరి చేయాలని కోరుతున్నారు.

నాటుబాంబు పేలుడుపై కేసు నమోదు

యాదమరి: నాటుబాంబు పేలుడు ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు. మండలంలోని కాసిరాళ్లకొత్తూరు ఆది ఆంధ్రవాడకు చెందిన లోహిత్ (9) నాటు బాంబు పేలిన ఘటనలో గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్ మాట్లాడుతూ కొత్తూరు గ్రామానికి చెందిన తులసి తన కుమారుడితో కలిసి బుధవారం మధ్యాహ్నం మేకలు మేపడానికి వెళ్లారని చెప్పారు. ఆ సమయంలో అశోక్ పొలంలో బాలుడు ఆడుకుంటుండగా అక్కడ డిటోనేటర్‌కు సంబంధించిన కేబుల్ తీగ కనిపించడంతో దానితో ఆడుకున్నాడని చెప్పారు. ఆ సమయంలో దాన్ని బలంగా లాగడంతో అతని నాటు బాంబు పేలి, బాలుడి ఎడమచేతికి గాయాలయ్యాయని చెప్పారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గురుకుల విద్యార్థికి అవార్డు

పూతలపట్టు(కాణిపాకం): పదో తరగతిలో ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో రాష్ట్రస్థాయి ఆరో ర్యాంకుకు సాధించిన పూతలపట్టులోని సంజీవరాయపల్లి గురుకుల పాఠశాల విద్యార్థి మోహన కృష్ణ(585)కు మంత్రులు బాల వీరాంజనేయ, సంధ్యారాణి అవార్డు అందజేశారు. విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రులు ఆ విద్యార్థికి అవార్డు ప్రదానం చేశారు. అలాగే రాష్ట్రస్థాయిలో స్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు ప్రిన్సిపల్ కోటేశ్వరరావు మంత్రుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. తమ విద్యార్థి మోహన్‌కృష్ణ రాష్ట్ర స్థాయిలో అవార్డు సాధించడంపై ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

లాటరీ విక్రేతలపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్ : లాటరీ విక్రయిస్తున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు నగరంలో గురువారం లాటరీ విక్రయాలపై వన్‌టౌన్ పోలీసులు విస్తృత దాడులు చేశారు. ఇందులో లాటరీ విక్రయిస్తున్న ఆరుగురిని పట్టుకుని, రూ.35 వేల నగదు, రూ.95 వేలు విలువ చేసే లాటరీ టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

మాక్‌డ్రిల్



రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



మాక్‌డ్రిల్‌లో భాగంగా ప్రయాణికుల తరలింపు



బాంబు గుర్తింపు, సహాయక చర్యలు

చిత్తూరు కార్పొరేషన్: భారత్–పాక్ దేశాల మధ్య ఉద్రికత్తల వేళ జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు రైల్వేస్టేషన్‌లో పోలీసులు ప్రయాణికుల సహకారంతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. గురువారం రైల్వేస్టేషన్‌లో ఉగ్రవాదులు బాంబు పెడితే ప్రయాణికులను ఎలా అప్రమత్తం చేయాలి ? అనే అంశంపై కార్యక్రమం నిర్వహించామని పోలీసులు తెలిపారు. రైల్వేస్టేషన్‌లోకి చొరబడిన ఉగ్రవాదులను పట్టుకోవడం, గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయాలను అందించడం.. బాంబు పేలుడు, క్షతగాత్రుల తరలింపు, బాంబు, డాగ్ స్క్వాడ్‌ల ద్వారా బాంబును గుర్తించి వాటి కనెక్షన్‌ను సురక్షితంగా తొలగించడం తదితర అంశాలను కళ్లకు కట్టినట్లు చేసి చూపించారు. ఉగ్రవాదులు దాడులకు పాల్పడితే స్టేషన్‌లో ప్రయాణికులు ఎక్కడికక్కడే నిలబడకుండా నేలపై పడుకోవాలని, లైట్లు ఆపివేయాలని, మొబైల్, టార్చ్ లైట్ వేయరాదన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శివానందకిషోర్, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐలు మహేశ్వర, నెట్టికంతయ్య, ఆర్పీఎఫ్ సీఐ కుమార్, సహాయ ఫైర్ ఆఫీసర్ కరుణాకర్, ఎంహెచ్‌ఓ లోకేష్, రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

11న మాలల ఆత్మీయ సభ



మాట్లాడుతున్న సంఘ నేతలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా.. మాలల ఐక్యతను చాటేందుకు ఈ నెల 11న తిరుపతిలో మాలల ఆత్మీయ గౌరవ సభను నిర్వహించనున్నట్లు సీనియర్ దళిత జాతీయ నేత దుగ్గాని జయరాం తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మాలలకు అన్యాయం జరుగుతోందని.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలకులు నడుచుకుంటున్నారని ఆవేదన చెందారు. మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టడానికి వర్గీకరణను అస్త్రంగా వాడుకుంటున్నారని వాపోయారు. మాలల ఐక్యతను, ఆత్మగౌరవాన్నీ చాటేలా ఈనెల 11న తిరుపతి జిల్లా తిరుపతి నగరంలోని ఆశా కన్వెన్షన్ హాల్లో మధ్యాహ్నం 3 గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధ మాలసంఘాల నాయకులు రాఘవులు, దామోదరం, ధనుంజయరావు, రాజ్ కుమార్, దాము, దయానందం, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ వ్యవసాయ విధానాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్



గుడిపాలలో..

తవణంపల్లె: రైతులకు డిజిటల్ వ్యవసాయ విధానాలపై అవగాహన అవసరమని వ్యవసాయాధికారి జి. ప్రవీణ్, భారతి తెలిపారు. మండలంలోని వెంగంపల్లె, టి.పుత్తూరు రైతుసేవా కేంద్రాల్లో గురువారం రైతులకు మూడవ స్థాయిలో వ్యవసాయశాఖ ద్వారా స్కిల్ యాప్ చిత్తూరు–డిజిటల్ ట్రైనింగ్ వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు స్మార్ట్‌ఫోన్ల వినియోగం గురించి వివరించారు. అదే విధంగా వ్యవసాయంలో డిజిటల్ చెల్లింపులు ఎలా చేయాలనే అంశాలపై తెలిపారు. వ్యవససాయంలో యూట్యూబ్ పాత్ర, ప్రాముఖ్యత, వ్యవసాయ సంబంధిత యూట్యూబ్ చానళ్ల ఉపయోగాలు, నష్టాలు, మైక్ పాత్ర గురించి వివరించారు. వ్యవసాయ రంగంలో పశువుల పాత్ర గురించి తెలిపారు. వ్యవసాయ యాప్‌లను రైతులు అవగాహనతో వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి లేష్మ, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ దీపిక, రైతులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు అవలంభించి అధిక ఆదాయం పొందాలని మండల పర్యవేక్షక అధికారి తులసిరామ్ సూచించారు. గురువారం మండలంలోని ఎర్రేపల్లె రైతు సేవా కేంద్రంలో స్థానిక రైతులకు చిత్తూరు స్కిల్ యాప్ డిజిటల్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఆనంద్‌రాజ్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: రైతులు వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి మాధవి అన్నారు. గురువారం బొమ్మసముద్రంలో రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మానిటరింగ్ ఆఫీసర్ సుధాకర్‌యాదవ్, మాస్టర్ ట్రైనర్ నదీమ్, సెరికల్చర్ అసిస్టెంట్ ప్రమీలలు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: పంటల సాగులో రైతులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని ఏఓ చిట్టిబాబు అన్నారు. మండలంలోని గుంతూరు రైతు సేవా కేంద్రలో గురువారం స్కిల్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్‌నాయుడు, విస్తరణాధికారి సాదరయ్య, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు



కృష్ణాపురంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: వడదెబ్బకు గురికాకుండా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. గురువారం మండలంలోని కృష్ణాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 32 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో వృద్ధులు ఎండల్లో తిరగకుండా ఇంటి దగ్గర ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నలిశెట్టిపల్లెలో వైద్యసేవలు..

మండలంలోని నలిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కేశవనారాయణ వైద్యసేవలు అందించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. జ్వరాలు సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు సురక్షితం



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



గుడిపాల: 189 కొత్తపల్లెలో..

ఐరాల: ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత తెలిపారు. గురువారం మండలంలోని నాగంవాండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 55 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. రక్తహీనత తలెత్తకుండా పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు చేయించుకుని ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుడిపాల: ప్రతి ఇంటికీ సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ సంధ్య అన్నారు. గురువారం 189కొత్తపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిలో అవసరమైన వారికి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్‌లు 62 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌తో భేటీ



మాజీ సీఎం జగన్‌ను ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు కలిసిన జ్ఞానజగదీష్

చిత్తూరు కార్పొరేషన్: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ కలిశారు. గురువారం తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డితో పాటు వెళ్లి పలు అంశాలపై మాట్లాడారు. చిత్తూరు జిల్లాలో వేలాది మందితో కలిసి బీసీ సభ ఏర్పాటు చేసే యోచన చేస్తున్నట్లు జగనన్న దృష్టికి తీసుకెళ్లినట్లు జ్ఞానజగదీష్ తెలిపారు. గతంలో ఓసీ సామాజికవర్గంలో ఉన్న మొదలియార్లను దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో బీసీలుగా మార్చినట్లు గుర్తు చేశామన్నారు. దీంతో పలువురు మొదలియార్ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి ఉద్యోగాలు పొందారన్నారు. అలాగే జిల్లాకు సంబంధించిన పలు అంశాలను అధినేత దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

ఫ్రైడే..డ్రైడే పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఫ్రైడే– డ్రైడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం విధిగా ఫ్రైడే..డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు హైరిస్క్ ప్రాంతాలను గుర్తించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, డెంగీ కేసులు నమోదైతే తక్షణం స్పందించాలన్నారు. నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

హైరోడ్డు అభివృద్ధి ప్లాన్ ప్రచురణ



ప్లాన్‌ను ప్రచురిస్తున్న కమిషనర్, ఏసీపీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో హైరోడ్డును విస్తరించి అభివృద్ధి చేయడంపై అధికారులు రూపొందించిన ప్లాన్‌ను గురువారం ప్రచురించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ నరసింహ ప్రసాద్ ఏసీపీ నాగేంద్ర నూతన ప్లాన్‌ను ప్రచురించారు. తిరుపతి రోడ్డులోని ఫ్లెటైవర్ బ్రిడ్జి నుంచి వివేకానంద విగ్రహం పక్కన ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జ్ వరకు 1.1 కిలో మీటర్ల దూరం వరకు రూపొందిన ప్లాన్‌లో భవన యజమానులకు ఏవైనా సందేహాలు ఉంటే ఈనెల 23వ తేదీలోపు కార్పొరేషన్ అధికారులకు రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శుభప్రద, బిల్డింగ్ సూపర్‌వైజర్ బాలాజీ, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే పునాది



బంగారుపాళెం: మండల అనుబంధ కమిటీ అధ్యక్షులను అభినందిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

- పూతలపట్టు సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పునాది అని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. నూతనంగా నియమితులైన మండల అనుబంధ కమిటీల అధ్యక్షులంతా గురువారం మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ సునీల్ కుమార్‌ను మర్యాద పూర్వకరంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఎండకట్టాలన్నారు.

గ్రామస్థాయి నుంచి బలోపేతమే లక్ష్యం

గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మండల అధినాయకులతో కలసి సమష్టిగా పని చేయాలని తెలిపారు. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అంతా కలిసి కట్టుగా పని చేసి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేవరకు పని చేద్దామని ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రస్తుతం మనం ప్రతిపక్షంలో ఉన్నామని, కూటమి ప్రభుత్వం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల అనుబంధ కమిటీ అధ్యక్షులుగా నియమితులైన రైతు విభాగం అధ్యక్షుడు అరుణామల్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు సుబ్రమణ్యం, బీసీ సెల్ అధ్యక్షుడు మొగిలీశ్వర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు నాగరాజ, మండల యువత అధ్యక్షుడు గజేంద్ర, మహిళా విభాగం అధ్యక్షురాలు వాణిప్రియ, మైనారిటీ వింగ్ అధ్యక్షుడు షాకీర్, వాణిజ్యవిభాగం అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు సురేంద్ర, సోషల్ మీడియా అధ్యక్షుడు శైలేష్‌బాబు, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాష్‌రెడ్డి, వలంటీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, ఐటీ విభాగం అధ్యక్షుడు సుధీర్, మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రియాజ్‌ను అభినందించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఫిరోజ్‌అహ్మద్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ర్యాంకర్లకు అభినందనలు



ప్రజ్వలను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



నక్షత్రను అభినందిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన పీఎస్‌ఎన్ శ్రీ వివేకానంద కళాశాల విద్యార్థినులను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ శభాష్ అని అభినందించారు. జిల్లా కేంద్రంలోని మురుగానపల్లి లో ఉన్న పీఎస్‌ఎన్ శ్రీవివేకానంద కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. గురువారం ఆ విద్యార్థినులకు కలెక్టరేట్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో చిత్తూరు విద్యార్థిని ప్రజ్వల 470 మార్కులకు 468 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. ద్వితీయ సంవత్సరంలోనూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే ఎంపీసీ చదువుతున్న నక్షత్ర 470కి 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. కరస్పాండెంట్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మొదటి రెండు ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. ఏప్రిల్ 12వ తేదీన ప్రకటించిన ఫలితాల్లో మొదటి సంవత్సరం చదువుతున్న ప్రజ్వలకు 470కి 462, నక్షత్రకు 463 మార్కులు వచ్చాయన్నారు. ఆ ఇద్దరు విద్యార్థినులు ఇంగ్లిష్ సబ్జెక్టులో బాగా సమాధానాలు రాసినప్పటికీ మార్కులు తగ్గాయనే సందేహంతో రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. రీ వెరిఫికేషన్ ఫలితాలు రావడంతో ప్రజ్వలకు ఇంగ్లిష్ సబ్జెక్టులో 93 మార్కుల నుంచి 98, నక్షత్రకు 95 నుంచి 99 మార్కులకు పెరిగాయని తెలిపారు. దీంతో ప్రజ్వలకు 470 మార్కులకు 468, నక్షత్రకు 467 మార్కులు వచ్చాయన్నారు. జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా తమ కళాశాలలో చదివిన ప్రజ్వల ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. అనంతరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువతో కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరాజశెట్టి, ప్రజ్వల తల్లిదండ్రులు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి, సంగీత, నక్షత్ర తల్లిదండ్రులు సుధాకర్‌రెడ్డి, లీలావతి పాల్గొన్నారు.

చినుకు పడితే నరక ప్రయాణం



అధ్వానంగా మారిన నాగంవాండ్లపల్లె రోడ్డు

ఐరాల: మండలంలోని వీఎస్ అగ్రహారం నుంచి నాగంవాండ్లపల్లెకు వెళ్లే రహదారిలో చిన్నపాటి వర్షం పడినా ప్రయాణం నరకంగా మారుతుంది. గురువారం సాయంత్రం కురిసిన చిరుజల్లులకు రహదారి కుంటను తలపించింది. రహదారి మధ్యలో పెద్దగుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు నిలిచి పెద్ద మడుగులా మారింది. దీంతో వాహనదారులు ఆ బురదలో నుంచే వెళ్లాల్సి వస్తోంది. గుంతలో వర్షపు నీరు నిలవడంతో రోడ్డు కనిపించడం లేదని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

